క్లుప్తంగా

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



తాడికొండ: మండలంలోని తాడికొండ, పొన్నె కల్లుతో పాటు పలు గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సరైన పత్రాలు లేని రూ.5,47,872 విలువైన పురుగు మందులను సీజ్ చేసి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి బి. శ్రీనివాస నాయక్ తెలిపారు. దాడుల్లో కృష్ణాజిల్లా గన్నవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. సునీల్, ఒంగోలు పోలీసు ఇన్‌స్పెక్టర్ సీహెచ్. రవిబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి




తాడేపల్లి రూరల్: తాడేపల్లి సీపీఐ ద్వితీయ మహాసభకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తెలిపారు. గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సభలో ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావుతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు




తాడేపల్లి రూరల్: తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు బుధవారం నాటికి 225 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో ఈ. శరమ్మ, టి.దుర్గాభవాని, వై. రమాదేవి, ఎస్‌కే. హిమాంబి, ఉప్పు కాశమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి. నాగేశ్వరరావు, ఎం.ఆశీర్వాదం, వై.చిన్న సుబ్బారావు, తుపాకుల నాగేశ్వరావు, ఎం. గురవయ్య, షేక్ సుభాని,సింగ్, హఫ్గయ్య, షేక్ ఆరిఫ్, ఎం.శారద, రమణమ్మ, రిబ్కా, సువర్ణకుమారి, శివ కుమారి,నాగమలీశ్వరి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



దుగ్గిరాల: రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓఆర్ విజయబాబు సూచించారు. దుగ్గిరాల మండలంలోని ఈమని, పేరుకలపూడి గ్రామాల్లో బుధవారం పొలం బడి కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఏఓఆర్ మాట్లాడుతూ కౌలు రైతులంతా పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు సుధ, సంసోనమ్మ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

పసుపు యార్డు చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం



దుగ్గిరాల: పసుపు యార్డు చైర్మన్, డైరెక్టర్లకు దుగ్గిరాల టీడీపీ మహిళా అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత సన్మానించారు. యార్డు సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా చైర్మన్ ఉన్నం రూన్సీరాణి, 14మంది డైరెక్టర్లను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం అనిత మాట్లాడుతూ సంవత్సర కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని తెలిపారు. దుగ్గిరాల మండలంలో రోడ్లన్నీ వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిరసాని రవిశోషర్, కొంగర జోగేంద్ర, డైరెక్టర్ వెనిగళ్ల కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం



సభకు హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

- ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇదే ధోరణి
- నకిలీ మేనిఫెస్టోతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్న కూటమి ప్రభుత్వం
- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోలో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: అలవి గానీ హామీలివ్వడం, అధికారంలోకి రాగానే అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేయడం సీఎం చంద్రబాబునాయుడు నైజమని మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) విమర్శించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 15,16 వార్డుల్లో బుధవారం రాత్రి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజల్ని మోసం చేయడం ఇది మొదటి సారి కాదని, ఎప్పుడు గెలిచినా ఇలాగే చేస్తాడని విమర్శించారు. నేడు కూడా ఉచిత పథకాలు ఇస్తామని గొప్పలు చెప్పి చేసిందేమీలేదని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబునాయుడు మరిచిపోయారని, ప్రశ్నించే పవన్ కల్యాణ్ కనిపించడం లేదని తెలిపారు. ఇచ్చిన హామీలను చేయాలని గతంలో ప్రశ్నించినట్లు ఇప్పుడూ ప్రశ్నించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులకు పెట్టుబడులు పెట్టే సమయం ఆసన్నమైదని, వారికి ఆర్థిక సహాయం కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మహిళలకు పైసా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఇంకా అమలుల్లోకి రాలేదని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అన్ని పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. రైతు భరోసా పథకాన్ని దుక్కులు దున్నే సమయంలోనే రైతులకు అందజేశారని, మహిళలకు ఏటా రూ. 18 వేల ఆర్థికసాయం అందించారని తెలిపారు. వీటన్నింటికన్నా ఎక్కువ ఇస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే అమలు చేశాం కదా! అంటూ బుకాయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడిగిన వారిని నాలుక కోస్తానని మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలపై ప్రజలతో క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు జీలగ పెదగాలయ్య, ప్రధాన కార్యదర్శులు చిన్న పోతుల దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహసంధ్య, షేక్ సర్దార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సింగా గంగాధర్, ఉపాధ్యక్షుడు ఈదులమూడి డేవిడ్‌రాజు, పట్టణ మైనార్టీ మహిళ, విద్య విభాగాల అధ్యక్షులు షేక్ హుస్సేన్, దర్శి విజయశ్రీ, గోలి నరిసింహ, రాష్ట్ర, నియోజకవర్గ, పట్టణ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శివయ్య సన్నిధిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పూజల్లో ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్, అర్చకులు, వేద పండితులు

పెదకాకాని: స్థానిక శివాలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. శైవాగమం అనుసరించి శుక్రవారం వరకు నిర్వహించనున్న ఉత్సవాలలో తొలిరోజు ఉదయం పవిత్రాలు గల వెదురుపేటికలతో యాగశాల ప్రవేశం, శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య పూజ, ప్రాశన, రక్షాసూత్ర పూజ, ధారణ, ఋత్విగ్వరణ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, యాగేశ్వర కుంభస్థాపన, పూజ, వాస్తు కుంభస్థాపన, పూజ, వాస్తు శాంతి హోమం, బలి పర్యాగ్నికరణ, బలిహరణ తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి మంగళ వాయిద్యం, చతుర్వేద పారాయణలు, గోపూజ అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, వాస్తుశాంతి, వాస్తుపర్యగ్నీకరణ, మృత్సగ్రహణం, అంకురార్పణం, రక్షా బంధనం, మంత్రపుష్పం, హారతి విభూతి, కుంకుమ ప్రసాద వితరణ జరిగినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. రెండో రోజు గురువారం పలు పూజల్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమాల్లో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చక పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, అర్చకులు, దాతలు తెనాలికి చెందిన నేలవెల్లి కోటేశ్వరి, కర్నే శివ సందీప్ నాగ శిరీష దంపతులు, రెడ్డి నవీన్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు, నేలివెల్లి నాగప్రత్యూష పాల్గొన్నారు.

అగ్రగామిగా భారతి సిమెంట్



తాడేపల్లి రూరల్: నమ్మకానికి, దృఢత్వానికి ప్రతీక భారతి ఫాస్ట్ సిమెంట్ అని ఆ సంస్థ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ పొల్లా సురేష్ తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహావీర్ ఏజెన్సీలో బుధవారం భవన నిర్మాణ కార్మికులతో డీలర్ నాగిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ ఎస్ భవానీశంకర్, కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లి జెడ్పీ హైస్కూలులో ఈగల్ క్లబ్ ఏర్పాటు



ఈగల్ క్లబ్‌లో విద్యార్థులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన యాంటీ నార్కోటిక్స్ కార్యక్రమంలో భాగంగా పోలీసు డిపార్ట్‌మెంట్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులుతో కలిపి బుధవారం ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చక్కని ఆరోగ్యంతో విద్యను అభ్యసించి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. సిగరెట్, పాన్ పరాగ్, పొగాకు, గుట్కా వంటి చెడు అలవాట్లు కలిగిన వారికి వాటి వల్ల నష్టాలను వివరించి కట్టడి చేయాలని సూచించారు. తాడేపల్లి పోలీసు కానిస్టేబుల్ రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం అరికట్టడానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి హేయమైన చర్య

తాడేపల్లి రూరల్: కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆమె భర్త రాముపై టీడీపీ దాడి అత్యంత హేయమని స్టేట్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. బీసీ కులానికి చెందిన మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలు, కేబినెట్ హోదా కల్గిన హారికపై టీడీపీ సేన విచక్షణారహితంగా మారణాయుధాలతో దాడి చేయడం దారుణమని ఖండించారు. ఈ సంఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. ఆమెకు రక్షణ కల్పించాల్సిన ఖాకీలు పచ్చ చొక్కాలకు కాపలాదారులగా మారడం అత్యంత దురదృష్టకరమని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు, బీసీలకు, దళితులకు ఎన్నో ఉన్నత పదవులు ఇచ్చి ఎంతో గౌరవించారని గుర్తు చేశారు. మహిళలపై దాడిచేసే హీన సంస్కృతిని చంద్రబాబు ప్రోత్సహించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

వెనిగండ్ల హైస్కూలులో వ్యాయామోపాధ్యాయుడి విచారణ

పెదకాకాని: వ్యాయామోపాధ్యాయుడి కక్కుర్తిపై డెప్యూటీ డీఈఓ ఎం. ఏసురత్నం బుధవారం విచారణ చేపట్టారు. మండల పరిధిలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూలులో వ్యాయామోపాధ్యాయునిగా పనిచేసిన మస్తాన్‌రెడ్డి ఇటీవల నంబూరుకు బదిలీ అయ్యారు. ఈ సమయంలో ఎన్‌సీసీ విద్యార్థుల యూనిఫాం తీసుకు వెళ్లడంతో పాటు ఖాతాల్లో ఉన్న రూ. 2లక్షలను డ్రా చేయించి పట్టుకుపోయాడు. దీనిపై తల్లిదండ్రులు నంబూరు స్కూలుకు వెళ్లి పీఈటీని నిలదీశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై బుధవారం డెప్యూటీ డీఈఓ ఎం. ఏసురత్నం పాఠశాలకు వెళ్లి, ఎన్‌సీసీ విద్యార్థులను విచారణ చేశారు. పీఈటీ ఎన్‌సీసీ యూనిఫాం తీసుకెళ్లిన మాట వాస్తవమేనని విద్యార్థులు వివరణ ఇచ్చారు. నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు డెప్యూటీ డీఈఓ తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలి



సమ్మెలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ నాయకులు

తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తాడేపల్లిలో బుధవారం పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విజయవంతం అయింది. మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు జరిగిన సభకు సీఐటీయూ తాడేపల్లి నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో యోగా పేరుతో ఒక పూట కార్యక్రమానికి ప్రభుత్వం రూ. 350 కోట్లు ఖర్చు పెట్టిందని, ఇది ఎవడబ్బ సొమ్మని ఆయన ప్రశ్నించారు. రెక్కలు ముక్కలు చేసుకొని పట్టణాలు, పల్లెలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచమంటే డబ్బులు లేవనడం సిగ్గుగా అనిపించడం లేదా ? అని ముఖ్యమంత్రిని నిలదీశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పల్లె కృష్ణ, ఎన్. దుర్గారావు, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఏఐటీయూసీ నాయకులు టి. వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు



కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పిడపర్రు గ్రామం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం .. మండల పరిధిలోని అన్నవరం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పామర్తి శ్రీరామకృష్ణ మరో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధుతో కలసి బైకుపై వల్లభాపురం గ్రామ సచివాలయానికి వెళుతున్నారు. పిడపర్రు శివారులో రోడ్డుకు అడ్డంగా భారీ పాము ఎదురుపడింది. దీంతో సడన్ బ్రేక్ వేయడంతో బైకు అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. ఈ ఘటనలో శ్రీరామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం తెనాలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కారంచేడు కన్నీటి వ్యథకు నలభై ఏళ్లు

దుగ్గిరాల: నాలుగు దశాబ్దాల కారంచేడు గాయంపై కారం చల్లుతున్న పవన్ కల్యాణ్, మనువాద బీజాలు కలిగిన సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం సిగ్గుచేటు అని ఏపీ ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరి నాగరాజు తెలిపారు. చిలువూరు దళిత వాడలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారంచేడులో, చుట్టుపక్కల గ్రామాల్లో తమ పెత్తనం ఎక్కడ ప్రశ్నార్థకం అవుతుందో అనే ఆందోళనలో కమ్మ సామాజిక వర్గీయులు అమానవీయ మారణకాండకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. చరిత్ర మరచిపోని దుర్ఘటనగా కారంచేడు ఘటనను పేర్కొన్నారు. దళితులను కొడవళ్లు, గండ్ర గొడ్డళ్లు, మారణాయుధాలతో విచక్షణారహితంగా నరికి చంపారని తెలిపారు. సనాతన ధర్మం పేరుతో రాష్ట్రంలో మనువాద హిందూ విష బీజాలను వెదజల్లుతూ, మత సామ్యరస్యానికి విఘాతం కలుగజేస్తున్న డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వెంటనే సస్పెండ్ చేసి, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

నైపుణ్యాలు పెంపునకు స్కిల్ డే సదస్సు దోహదం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుగ్గిరాల: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్కిల్ డే అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని హెచ్‌ఎం బి.వెంకట కృష్ణారావు తెలిపారు. రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, స్కిట్స్ పోటీలు జరిపారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ పి.ఝాన్సీ, జి.కల్యాణి, జనార్దనరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్ మృతి

తెనాలి రూరల్: అనుమానాస్పద స్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాల వద్ద చోటు చేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌కు చెందిన దాసరి బాలస్వామి (20) గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నేహితులతో కలసి జగ్గడిగుంట పాలెంలోని టిడ్కో గృహాలకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం చూడగా కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నా డు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు స్నేహితులపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు పడి ఉంటాడని, తమకు తెలియదని స్నేహితులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతి కింద రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూమి సారవంతం



ఘన వ్యర్థాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏవో వాసంతి

ఫిరంగిపురం: పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసరలను భూమిలో కలియదున్నడం వల్ల సారవంతంగా ఉంటుందని ఏవో వాసంతి చెప్పారు. మండలంలోని వేమవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేల సారవంతం అయితే పంటలు బాగా పండుతాయని చెప్పారు. భూమి బెట్టకు రాదని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. పత్తి సాగులో సమగ్ర సస్యరక్షణ పాటించాలని చెప్పారు. పొగాకులో లద్దె పురుగు నివారణకు ఆముదం మొక్కలు పెంచాలని సూచించారు. ఐటీసీ కంపెనీ ప్రాజెక్ట్ అసోసియేట్ కోటేశ్వరరావు తడిపొడి వ్యర్థాల విభజన, తడి వ్యర్థాలతో వర్మీకంపోస్టు తయారీ గురించి వివరించారు. అనంతరం ఘన వ్యర్థాలు గురించి సమగ్రంగా తెలియజేసే వాల్‌పోస్టర్లను ఏవో వాసంతి ఆవిష్కరించి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి షేక్ సుభాని, వ్యవసాయ సహాయకులు సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి లోకేష్ సమీక్ష

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై బుధవారం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మూడు వేల మందికి ఇళ్లపట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో రెండు వేలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హలీమ్ బాషా, ఎండోమెంట్స్ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎంటీఎంసీ ఎస్ఈ శ్రీనివాసరావు, డెప్యూటీ సిటీ ప్లానర్ అశోక్, డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాయి రాహుల్‌కు అభినందనలు

విశాఖలో జరిగిన ఏపీఎల్ సీజన్ - 4 వేలంలో మంగళగిరికి చెందిన కేపీ సాయి రాహుల్ కాకినాడ కింగ్స్ తరఫున ఎంపిక కావడం ఆనందంగా ఉందని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. సాయి రాహుల్ క్రికెట్ కెరీర్‌కు అవసరమైన అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లోకేష్ ఆకాంక్షించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు విక్రయిస్తే చర్యలు



పెదవడ్లపూడిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు

తాడేపల్లి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. సునీల్ హెచ్చరించారు. మంగళగిరి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని కారణంగా రూ.3,30,850 విలువైన విత్తన విక్రయాలను నిలుపుదల చేశారు. స్టాక్ బోర్డులో డిస్‌ప్లే చేయని రూ. 6,16,419 విలువైన 510 లీటర్ల పురుగు మందుల విక్రయాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు సునీల్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల సౌకర్యార్థం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చింతా రవిబాబు, మండల వ్యవసాయ అధికారిణి శైలజారాణి, గుంటూరు మండల వ్యవసాయ అధికారి బి. కిశోర్ పాల్గొన్నారు.

మంగళగిరి ఆటోనగర్ ప్లాట్లను సేల్ డీడ్ చేయాలి

తాడేపల్లి రూరల్: మంగళగిరి ఆటోనగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం యజమానుల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ జాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలోని ఆటోమొబైల్స్ ఓనర్స్‌కు 20 సంవత్సరాలు కిందట ఆటోనగర్‌లో ప్లాట్స్ ఇచ్చారని, సేల్ డీడ్ జరగలేదని తెలిపారు. ఏపీఐఐసీ అధికారులు డబ్బు కట్టించుకొని, మౌలిక సదుపాయాలు కల్పించలేదని చెప్పారు. ప్లాట్స్ అభివృద్ధి చేయలేదని వంకతో 62 రద్దు చేశారని, తిరిగి లబ్ధిదారులకు ప్లాట్లు అందజేయాలని ఆయన కోరారు. ఆటోనగర్‌పై కొంతమంది అపోహలు సృష్టించి విష ప్రచారాలు చేస్తున్నారని, వారిపై అసోసియేషన్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రభుత్వం కూడా ప్లాట్స్ ఓనర్ల సమస్యలు పరిష్కరించి ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు పోతిన పూర్ణచంద్రరావు, కోశాధికారి రుద్రు శివ, అసోసియేషన్ నాయకులు మున్వర్ బేగ్, హస్సన్, బుల్లా హరిబాబు పాల్గొన్నారు.

రోడ్లు, కాల్వల నిర్మాణానికి శ్రీకారం

తెనాలిఅర్బన్: పట్టణంలో రోడ్లు, కాల్వలు నిర్మాణానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 11వ వార్డు గురవయ్య కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, కాల్వలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ రూ.7.20 లక్షలతో నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

గుంటూరు జిల్లా, తాడికొండ మం॥ రావెల గ్రామం డి. నెం. 5-145, మాచవరపు ద్రౌపతి W/o శంకరరావు.ద.నెం. 4137/1964 గల రిజిష్టరు ఒరిజినల్ దస్తావేజులు తీసుకొని ది. 07-07-2025న రావెల నుండి తాడికొండకు ఆటోలో వచ్చుచుండగా పోయినవి. దొరికిన వారు 9618875040 నెంబరుకు తెలియపరచగలరు.